క్లుప్తంగా

హాస్టళ్లను తనిఖీ చేసిన ఎంపీడీఓ


హాస్టల్లో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కంభం: కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను గురువారం ఎంపీడీఓ వీరభద్రాచారి తనిఖీ చేశారు. హాస్టళ్లలోని విద్యార్థులతో మాట్లాడి సమస్యలడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంటగది, గదులు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తూ ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని వార్డెన్లకు సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బేస్తవారిపేట: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి సూచించారు. కొందరు వ్యక్తులు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ సైబర్ నేరాలు చేస్తున్నారన్నారు. హ్యూమన్ రైట్స్ కమిషన్ పేరుతో, కొన్ని అనుబంధ సంస్థల అధికారులమంటూ ఫోన్ కాల్స్ చేసే కేటుగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫేక్ వెబ్‌సైట్‌లు, ఐడీ కార్డులు, సోషల్ మీడియా గ్రూపులు సృష్టించి వ్యక్తుల వ్యక్తిగత డేటా, బ్యాంక్ వివరాలు సేకరించి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఎటువంటి బెదిరింపు కాల్స్ వచ్చినా, మోసపూరిత వ్యక్తులను గుర్తించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా లీలాకృష్ణ


ఈఓ లీలాకృష్ణ (ఫైల్)

పొదిలి రూరల్: పొదిలి పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ)గా బి.లీలాకృష్ణ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం మద్దిపాడులో గ్రూఫ్ ఆఫ్ టెంపుల్స్‌లో పని చేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. లీలాకృష్ణ శుక్రవారం పొదిలి శివాలయంతో పాటు పొదిలికొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల బాధ్యతలు స్వీకరించి అనంతరం దేవాలయాలను పరిశీలిస్తారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఈఓగా పని చేసిన ఎం.శ్రీనివాసరావు ఒంగోలులోని ముంగమూరుకు బదిలీ అయ్యారు.

గుండ్లమోటును పరిశీలించిన ఇరిగేషన్ డీఈ


గుండ్లమోటును పరిశీలిస్తున్న డీఈ

గిద్దలూరు రూరల్: మండలంలోని గుండ్లమోటు చెరువును ఇరిగేషన్ డీఈ బి.జయరామయ్య గురువారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుండ్లమోటు చెరువులో ఎంత మేర నీరు వచ్చి చేరిందని అంచనాలు వేశారు. గుండ్లమోటుకు నిర్మించిన కత్తువలను పరిశీలించారు. సమీపంలోని వెంకటాపురంతండా, వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులతో మాట్లాడారు. అనంతరం సగిలేరు సప్లయ్ చానల్ కాలువను పరిశీలించారు. సగిలేరు సప్లయ్ చానల్ వాగు రాచర్ల మండలంలోని 5 చెరువులకు నీరు వెళ్లే కాలువ అని గ్రహించి సగిలేరు సప్లయ్ చానల్ కాలువ అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు పరిశీలించారు. ఆయన వెంట ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బొర్రా శేఖర్‌యాదవ్, సిబ్బంది ఉన్నారు.

బ్రాహ్మణ సత్రాల సలహాదారునిగా జగన్నాథ్


జగన్నాథ్

మార్కాపురం: అఖిల భారత కరివెన బ్రాహ్మణ సత్ర సలహాదారునిగా పట్టణానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత హెచ్‌ఎం తంగిరాల నాగజగన్నాథ్‌ను నియమిస్తూ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎన్ఆర్ శ్రీనివాస్, డాక్టర్ వేణుగోపాల్ నియామక పత్రాన్ని పంపారు. మూడున్నర దశాబ్దాలకుపైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న డాక్టర్ జగన్నాథ్ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న కరివెన బ్రాహ్మణ సత్ర సముదాయాలకు సంబంధించి తనను సలహాదారునిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. సత్రం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన సతీమణి శర్వాణి ప్రస్తుతం కంభం మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్నారు. సత్రం జాతీయ కోశాధికారి గోపాలుని హరిహరరావుతో పాటు పలువురు కమిటీ సభ్యులు ఆయన్ను అభినందించారు.


గొట్లగట్టులో భారీగా కోతకు గురైన పొలాలు


నీట మునిగి ఉరకెత్తుతున్న అలసంద

వానమ్మా..ఓ నెల ఆగమ్మా!

- ఇప్పటికే నీట మునిగిన పంట పొలాలు
- నీటిని జనరేటర్లతో బయటకు పంపుతున్న రైతులు


అక్కచెరువులో నీటిని బయటకు పంపేందుకు వినియోగిస్తున్న జనరేటర్

కొనకనమిట్ల:

అల్పపీడన ప్రభావంతో ఇటీవల పది రోజుల పాటు కురిసిన భారీ వర్షాల ధాటికి కుదేలైన రైతులు మళ్లీ వర్షం పడుతుండటంతో గందరగోళ పరిస్థితిలో ఉన్నారు. పంట పొలాలు నీట మునిగి కోతకు గురవటంతో పాటు ఉరకెత్తిపోయింది ఎలాగూ పోయింది.. ఉన్న పంటనైనా కొంతమేర కాపాడుకుందామంటే ఒకటే వర్షం.


నాగంపల్లి లోతట్టు పొలంలో వర్షం నీరు

ఉదయం విపరీతమైన ఎండ కాస్తోంది, సాయంత్రం అయ్యేసరికి మబ్బులు పట్టడం పదును వర్షం పడటం నిత్యకృత్యమైంది. ఎక్కువగా మిరప, అలసంద, పొగాకు ఉరకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపే మార్గం లేక ఇబ్బందులు పడుతుంటే మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టు మళ్లీ వర్షం పడటంతో లోతట్టు పొలాల్లోకి వర్షం నీరు చేరుతుంది. ఇదేం వానరా దేవుడా.. ఒక నెల ఆగి వర్షం పడితే బాగుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 25న మరో తుఫాన్ ఉంటుందని ప్రచారం జరుగుతండటంతో ఇక మళ్లీ భారీ వర్షం పడితే ఈ ఏడాది రైతులు నిండా మునిగినట్టేనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు కోలుకోలేని దెబ్బ:



తుఫాన్ ప్రభావంతో పది రోజుల పాటు విస్తారంగా కురిసిన వర్షాలు రైతులకు తీవ్ర నష్టం చేకూర్చాయి. రబీ సాగులో మినుము, అలసంద పంటలతో పాటు మిర్చి, పొగాకు సాగు చేశాం. భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. నేను 50 ఎకరాల్లో బొబ్బర్లు (అలసంద), పది ఎకరాలలో మినుము పంట, పది ఎకరాల్లో పొగాకు సాగు చేశా. వాటిలో 20 ఎకరాల వరకు పంట నీట మునిగింది. సుమారు రూ.4 లక్షల వరకు పెట్టుబడి పెట్టా.

– పొదిలి తిరుపతయ్య, గొట్లగట్టు

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, పక్కన కమిషనర్, సీఐ

- మార్కింగ్ ఇచ్చిన మున్సిపల్ అధికారులు

మార్కాపురం: పట్టణాన్ని విస్తరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం సాయంత్రం సబ్ కలెక్టర్ త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, సీఐ సుబ్బారావు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు స్థానిక కళాశాల రోడ్డు నుంచి ప్రారంభించిన మార్కింగు, దోర్నాల బస్టాండు, పాతబస్టాండు, రీడింగు రూము, కంభం సెంటరు మీదుగా కొనసాగింది. మున్సిపల్ అధికారులు ప్లాన్ దగ్గర పెట్టుకుని మార్కింగులు ఇస్తున్నారు. దీంతో పలువురు వ్యాపారులు, గృహాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కంభం రోడ్డులో ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న బంకులు, టీకొట్లు, ఇతర దుకాణాలు తొలగించాలని సంబంధిత వ్యాపారులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలోనే అధికార యంత్రాంగమంతా గురువారం సాయంత్రం నుంచి పట్టణంలోని మెయిన్‌బజారులో పర్యటిస్తూ తమ వద్ద ఉన్న ప్లాన్ ప్రకారం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టుకున్న కట్టడాలపై మార్కింగ్ ఇచ్చి వారం రోజుల లోపు తొలగించాలని హెచ్చరిస్తున్నారు. పలువురు వ్యాపారులు మున్సిపల్ కాలువలను ఆక్రమించి కొన్ని ప్రాంతాల్లో రేకుల షెడ్లు వేసి అద్దెకివ్వడాన్ని అధికారుల బృందం గుర్తించింది. మరికొంత మంది మున్సిపల్ స్థలాలను ఆక్రమించి వాటిని కూడా అద్దెకివ్వడాన్ని గుర్తించారు. తాము ప్లాన్ ప్రకారమే కట్టుకున్నామని పలువురు భవన యజమానులు, వ్యాపారులు అధికారులకు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ఘర్షణలు, వాగ్వాదాలు జరగకుండా ముందస్తుగా పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, ట్రాఫిక్ ఎస్సై అహరూన్, సిబ్బంది, అధికారుల వెంట ఉన్నారు. తాము మున్సిపల్ అధికారుల ప్లాన్‌ప్రకారం కట్టుకున్నా అక్రమమంటూ మార్కింగ్ ఇవ్వడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.


మార్కింగ్ ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

కొనసాగుతున్న కాంట్రాక్టు కార్మికుల నిరసన దీక్ష


మాట్లాడుతున్న రఫీ

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘ కార్యాలయంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. గురువారం పురపాలక సంఘం కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు నిర్వహిస్తున్న నిరసన దీక్ష 10వ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో దాదాపు 20 నుంచి 25 ఏళ్లగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం చిరుద్యోగులపై తమ ప్రతాపం మానుకొని కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా కూటమి ప్రభుత్వం తమను అక్రమంగా తొలగించి తమ ఉపాధిని కోల్పోయేలా చేసిందని మండిపడ్డారు. ఇమాంసా, సుబ్బయ్య, చెన్నకేశవులు, జి. హరి, శ్రీను, కనకయ్య, షబ్బీర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డీజీఆర్ ఆధ్వర్యంలో ఉచితంగా హెల్మెట్ల పంపిణీ


హెల్మెట్లు అందజేస్తున్న డాక్టర్ హరినాథరెడ్డి

గిద్దలూరు రూరల్:పట్టణంలోని డీజీఆర్ వైద్యశాల సిబ్బందికి డాక్టర్ హరినాథరెడ్డి గురువారం ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్ నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ఉపయోగించాలన్నారు. ప్రమాదాల బారిన పడిన సమయంలో తలకు దెబ్బ తగలకుండా రక్షణ కల్పించేది హెల్మెట్టేనని అన్నారు. వైద్య సిబ్బంది బైక్‌లు నడిపే సమయంలో పోలీసులు హెల్మెట్ లేని కారణంగా జరిమానాలు విధిస్తున్నారని, సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో సిబ్బందికి ఉచితంగా హెల్మెట్లు అందజేస్తున్నామని అన్నారు. పోలీసుల సూచనల మేరకు బైక్‌లు నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక, ఆర్థిక విషయాలపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ఏపీజీబీ మేనేజర్ శ్రీనివాసులు

మార్కాపురం రూరల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు తిప్పాయపాలెం శాఖ ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో మండలంలోని మాల్యవంతునిపాడులో గురువారం అవగాహన సదస్సు బ్యాంకు మేనేజర్ జూపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ తమ బ్యాంకు పూర్తి ప్రభుత్వ సంస్థ అని, డిపాజిట్లకు భద్రత ఉంటుందని, అన్నీ బ్యాంకుల కన్నా డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రగతి త్రివేణి 333 పథకం సాధారణ పౌరులకు 7.45 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్స్‌కు 7.95 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్స్‌కు 8.02 శాతం, మహిళలకు అదనంగా 8.05 అదనపు వడ్డీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నెలకు కోటి రూపాయల పరిమితితో నగదు నిర్వహణ చార్జీలు లేకుండా, మొబైల్ బ్యాంకింగ్ సేవలు పూర్తిగా ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. రైతులకు వ్యవసాయ, అనుబంధ రుణాలు, ట్రాక్టరు, పాడి గెదెలు, గొర్రెల పెంపకం, విద్య, వ్యవసాయ, వ్యాపార, గృహ నిర్మాణ, వాహన కొనుగోలు, తనఖా రుణాలు, రూఫ్‌టాప్ సోలార్, స్వయం సహాయక సంఘాల రుణాలు అందిస్తుందని తెలిపారు. గుంటూరుకు చెందిన ఎంఎస్‌ఆర్ కళాజాత బృందం నాటక ప్రదర్శన ఖాతాదారులను ఆకట్టుకుంది. సిబ్బంది ఎం.రమయ్య, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, కవిత, బ్యాంకు కరస్పాండెంట్ పీరమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఇన్‌చార్జి ఎంపీడీఓ


హాస్టల్స్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ భాగ్యవతి

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం, గజ్జలకొండ, రాయవరం, మిట్టమీదిపల్లి గ్రామాల్లో ఉన్న కెజీబీవీని, ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ హాస్టల్స్, పాఠశాలలను గురువారం ఉదయం ఆకస్మికంగా మార్కాపురం ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలను ఆమె తనిఖీ చేసినట్లు చెప్పారు. పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం, రేషన్, కాస్మొటిక్ బిల్లులు ఎలా అందుతున్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలల్లో వంట గదులను పరిశీలించారు. పాఠశాలల రికార్డులను తనిఖీ చేశారు. ఈమె వెంట మార్కాపురం ఎంఈఓ–2 శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కామేశ్వరరావు సేవలు మరువలేనివి


కామేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: కార్మిక రత్న ఎస్ఏఎస్ కామేశ్వరరావు చేసిన సేవలను మరువలేనివని విద్యుత్ సంఘాల నాయకులు కొనియాడారు. గురువారం ఎస్ఏఎస్ కామేశ్వరరావు జయంతి సందర్భంగా విద్యుత్ కార్యాలయం ఆవరణలో ఉన్న కామేశ్వరరావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యుత్ సంఘాల నాయకులు టి. చంద్రశేఖర్‌రెడ్డి, రామారావు, రమణారెడ్డి, జోసఫ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి డాక్టర్ల వినతి


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ రాహుల్

మార్కాపురం: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ పీహెచ్‌సీ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.రాహుల్ ఆధ్వర్యంలో వైద్య బృందం గురువారం మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించినట్లు రాహుల్ తెలిపారు. ప్రధానంగా పీహెచ్‌సీ వైద్యులకు ప్రతిబంధకంగా మారిన సర్వీసు కోటాను పునరుద్ధరించాలని, ప్రమోషన్లు ఇవ్వాలని, ట్రైబల్ అలవెన్సులు ఇవ్వాలని తదితర డిమాండ్లతో మంత్రితో పాటు హెల్త్ డైరెక్టర్ పద్మావతిలకు వినతిపత్రాలు అందించినట్లు చెప్పారు. గతంలో గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీల్లో మూడేళ్లు పనిచేసిన వైద్యులకు పీజీ సీట్ల కేటాయింపులో 30 శాతం రిజర్వేషన్ ఉండేదని, దాన్ని 15 శాతానికి తగ్గించారని, ఆ జీవోను ఉపసంహరించుకోవాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. ఆయన వెంట డాక్టర్ వినోద్, యూనియన్ నాయకులు ఉన్నారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి..


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

బేస్తవారిపేట: మోసపూరిత హామీలతో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ విమర్శించారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ రైతు సంఘ కార్యదర్శి డాకాల పుల్లయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.2 వేల కోట్లు కేటాయించి పూర్తి చేయాలన్నారు. 1996లో చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఆయన అధికారంలో ఉన్నప్పుడు 2004 వరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటినా సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేదన్నారు. పాఠశాలలు తెరిచి ఐదు నెలలు అవుతున్నా తల్లికి వందనం పథకం అమలు చేయలేదన్నారు. ఉచిత ఇసుకను గాలికి ఒదిలేశారన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు నియోజకవర్గాలపై పడి దోచుకునేందుకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. ఇంత అవినీతి ఎన్నడూ చూడలేదన్నారు. బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేస్తారనే అనుమానాలతో రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకే సనాతన ధర్మాన్ని చూపించి ప్రజలను భయపెట్టాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కోరుతూ ఈ నెల 28న అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో, 29న ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె నాసరయ్య, నియోజకవర్గ కార్యదర్శి కేవీ రమణ, సహాయ కార్యదర్శి వీ జోసఫ్, కంభం సీపీఐ కార్యదర్శి వై.శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహాలను పరిశీలించిన ఎంపీడీఓ


కస్తూరిబాలో వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొనకనమిట్ల: ప్రభుత్వ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు హాస్టల్స్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా వార్డెన్లు చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా వారికి అవగాహన కలిపించాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ స్పష్టం చేశారు. గురువారం పెదారికట్ల ఎస్సీ, గొట్లగట్టు బీసీ హాస్టల్స్‌ను, గొట్లగట్టు కేజీబీవీ పాఠశాలను ఆమె సందర్శించారు. అక్కడ వసతులు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించి తగు సూచనలు, సలహాలు వార్డెన్‌లకు సూచించారు. హాస్టల్ గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. దోమల నివారణకు హాస్టల్స్‌లో దోమతెరలు వాడాలన్నారు. బీసీ వసతి గృహంలో విద్యార్థులకు సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేదని గుర్తించారు. కస్తూరిబా పాఠశాలలో వాటర్ ప్లాంట్, వంట గదులను పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖతో పాఠశాలలోని మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఎంపీడీఓతో పాటు పంచాయతీ కార్యదర్శి బ్రహ్మనాయుడు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శివరామకృష్ణ ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు


భూ సమస్యలను తహసీల్దార్‌కు వివరిస్తున్న రైతులు

కంభం: అపరిష్కృతంగా ఉన్న రైతుల సమస్యలు పరిష్కరించడం కోసమే గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కిరణ్ అన్నారు. మండలంలోని నడింపల్లి గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో రీసర్వే పూర్తయి ఇంకా పరిష్కారం కాని సమస్యలున్న రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యలు పరిష్కరించడం కోసం చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌బాబు, వీఆర్వో పీర్సా, సర్వేయర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: గ్రామసభలు నిర్వహించి భూములు రీ సర్వేపై ఏమైనా తప్పులు జరిగితే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఆవుల సురేష్ అన్నారు. రీ సర్వే భూముల పరిష్కార గ్రామసభలను గురువారం మండలంలోని గొట్లగట్టు సచివాలయంలో బుడంకాలయపాడు రెవెన్యూ పరిధిలోని పొలాలకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూమి కొలతలు, విస్తీర్ణంలో మార్పులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వెబ్‌ల్యాండ్–2లో ఉన్న భూమికి వ్యత్యాసం ఉంటే తగిన ఆధారాలతో గ్రామ సభలో అర్జీలు అందజేయాలన్నారు. గ్రామ సభలో సర్పంచ్ పి.సుభదేవ్, ఆర్ఐ మహదేవరెడ్డి, వీఆర్ఓ దిలీప్‌కుమార్, జానయ్య, రైతులు పాల్గొన్నారు. కాగా బుడంకాయలపాడు రెవెన్యూ పరిధిలో పొలాలు ఉన్న గరిమినపెంట గ్రామ రైతులు గ్రామసభ గురించి తమకు తెలియపరచలేదని అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రాయవరం విద్యార్థులు


క్రీడాకారులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పీఈటీ

మార్కాపురం రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు టీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో మార్కాపురం ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ గరల్స్ రాయవరం విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.సునీత గురువారం తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో ఎస్‌వీజీ జడ్పీహెచ్ పాఠశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఎస్‌జీఎఫ్ఐలో భాగంగా అండర్ 17, 14లో భాగంగా డి.రసూల్ బీ, బి.గాయత్రి, వెంకట దివ్య, టి.యత్రిలు పాల్గొన్నట్లురు. విద్యార్థుప్రతిభ కనబరిచేలా ట్రెయినింగ్ ఇచ్చిన పీఈటీ రమాదేవిని అభినందించారు.

రూ.3 లక్షల విలువైన దీపావళి బాణసంచా పట్టివేత


స్వాధీనం చేసుకున్న దీపావళి టపాసులను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

మార్కాపురం: పట్టణంలోని వివేకానంద స్కూల్ వద్ద ఉన్న సత్యం రేకులషెడ్డును అద్దెకు తీసుకుని అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.3 లక్షల విలువైన దీపావళి బాణసంచా సామగ్రిని పట్టుకున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు. అందిన సమాచారంతో సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో దాడులు చేసినట్లు తెలిపారు. మండలంలోని అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన పోలెబోయిన వెంకటేశ్వర్లు సుమారు రూ.3 లక్షల విలువైన బాణసంచాను నిల్వ చేసినట్లు గుర్తించామని, నిందితునిపై కేసు నమోదు చేసి బాణసంచా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.